యాదగిరిగుట్టలో ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

కలశాలను తీసుకువస్తున్న ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘశ్ లక్ష్మీనరసింహాచార్యులు

యాదగిరిగుట్ట, మార్చి 11 : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళ వారం శృంగార డోలోత్సవంతో పరిపూర్ణమయ్యాయి. ఉదయం విశ్వక్సేన, పుణ్యాహవాచనం, హవన పూజలు చేసి పూర్ణాహుతి నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భక్తజనులను కటాక్షించేందుకు దశావతారాలు, వివిధ వాహన సేవల్లో అనుగ్రహించిన లక్ష్మీనరసింహస్వామిని 108 కలశాలతో వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ అభిషేకించారు. అభిషేకమూర్తులు స్వామి, అమ్మవార్లను తులసీదళాలు, వివిధ రకాల పుష్పాలతో అర్చించిన అర్చకులు క్షేత్ర మహత్యాన్ని భక్తులకు వివరించారు. సాయంత్రం లక్ష్మీనరసింహస్వామిని పట్టుపీతాంబరాలు, ముత్యాలు, రత్నాలు ఆభరణాలు, వివిధ రకాల పూలతో దివ్య మనోహరంగా అలంకరించి డోలికలో అధిష్ఠింపజేశారు. డోలారూఢుడైన స్వామిని సకల జగత్తును రక్షింపమని కోరుతూ సర్వవిధ రాగ తాళాలతో, సహస్రనామాలతో కొలుస్తూ శృంగార డోలారోహణ పర్వాన్ని జరిపారు. కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహ మూర్తి, ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘశ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, యజ్ఞాచార్యులు, ముఖ్య అర్చకులు, ఉప ప్రధానార్చకులు, ఏఈఓలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- అదనపు కలెక్టర్ గంగాధర్

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరి కలెక్టరేట్, మార్చి 11 : గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా సమగ్ర చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో తాగునీటిపై అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన చోట అద్దె బోర్లను తీసుకుని నీటి సరఫరా చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ శోభారాణి, మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్‌రావు, ఎంపీడీఓ సీహెచ్.శ్రీనివాసరావు, ఎంపీఓ మొరిగాడి దినకర్‌గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

మహిళా దినోత్సవ వేడుకల్లో మహిళలతో అదనపు కలెక్టర్

భువనగిరి కలెక్టరేట్, మార్చి 11 : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. మహిళా సంఘాల ద్వారా సాధించిన ప్రగతి, బ్యాంకుల్లో స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలు, తిరిగి చెల్లింపు తదితర అంశాల్లో జిల్లా ముందంజలో ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదుగాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రేణుక, అదనపు డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీపీఎం, ఏపీఎంలు, స్త్రీనిది సిబ్బంది, మండల సమాఖ్య అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు పాల్గొన్నారు.

జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో..

కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ మనోహర్, ఆరోగ్య శాఖ సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- డీఈఓ సత్యనారాయణ

టేకులసోమారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈఓ సత్యనారాయణ

వలిగొండ, మార్చి 11 : పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి గుర్తింపు తేవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ అన్నారు. మండలంలోని టేకులసోమారం, అరూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, శుభ్రమైన ఆహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. పరీక్షల సమయంలో ఆందోళన చెందవద్దని, ప్రణాళికాబద్ధంగా చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించి విద్యార్థుల పఠన పరిజ్ఞానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుంకోజు భాస్కర్, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, రమాదేవి, ఆనంద్, వెంకటేశం, వీరస్వామి, ప్రభాకర్, శ్రీదేవి, మంజుల, శ్రావణ్, చండీదాస్, వాసంతి, సునీత పాల్గొన్నారు.

సిరిపురం వాసికి గ్రూప్-2లో స్టేట్ 20వ ర్యాంక్

సిల్వేరు సురేశ్

రామన్నపేట, మార్చి 11 : మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన సిల్వేరు సురేశ్ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన గ్రూప్– 2 పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 20వ ర్యాంక్ సాధించాడు. మొత్తం 600 మార్కులకు గాను 411.865 సాధించాడు. సురేశ్ ప్రస్తుతం గ్రూప్– 4లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించి చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. గ్రూప్–2లో ర్యాంకు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యశోద

గర్భిణులకు డ్రై ఫ్రూట్స్ అందజేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యశోద

భూదాన్ పోచంపల్లి, మార్చి 11 : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యశోద అన్నారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. స్త్రీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. లక్ష్మీపురం పెద్ద నాగమ్మ జ్ఞాపకార్థం గర్భిణులకు, రోగులకు డ్రై ఫ్రూట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పోషకాహారం, కూరగాయలు, ఆకుకూరలు, పప్పు దినుసులు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పోతారెడ్డి, చౌటుప్పల్ డివిజన్ హెల్త్ ఎడ్యుకేషన్ వసంత, సూపర్‌వైజర్ అరుంధతి, రాపోలు లక్ష్మణ్, జలాల్‌పూర్ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం డాక్టర్ రంజిత్, ఆరోగ్య కార్యకర్త అనూరాధ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గొంగిడి దంపతులను విమర్శిస్తే బయట తిరగనివ్వం

- బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కర్రె వెంకటయ్య

యాదగిరిగుట్ట, మార్చి 11 : ఆలేరు అభివృద్ధి ప్రదాతలు మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై నోరుజారి విమర్శలు చేస్తే బయట తిరగనివ్వం.. తస్మాత్ జాగ్రత్త అని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులను బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య హెచ్చరించారు. గుట్ట దేవస్థానం అభివృద్ధికి రూపాయి కేటాయించేలా కృషి చేసే దమ్ములేని బీర్ల అయిలయ్య ఆలేరుకు ఎమ్మెల్యే కావడం సిగ్గు చేటన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వామివారి బ్రహ్మోత్సవ కల్యాణానికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించారని అన్నారు. సీఎం హోదాలో నాలుగు సార్లు యాదగిరిగుట్టకు వచ్చి ఒక్క రూపాయి కేటాయించకుండా వెళ్లారని మండిపడ్డారు. 10శాతం పెండింగ్ పనులను పూర్తి చేయలేని కాంగ్రెస్ పార్టీ నాయకులకు కొండపైన తిరిగే అర్హత లేదన్నారు. గుట్ట అభివృద్ధిని మరిచి ఆలయ ట్రస్టు బోర్డును ఏర్పాటు చేసి వైటీడీఏ భూములను, ఆలయ సంపదను దోచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దేవుడి ఆదాయాన్ని కొల్లగొట్టాలని చూస్తున్నారని, ఇందులో భాగంగానే ఆలయ ఈఓగా భాస్కర్‌రావును నియమించారని అన్నారు. ఆలయ అభివృద్ధిపై మాట్లాడే అర్హత కాంగ్రెస్ ప్రభుత్వానికి, నాయకులకు లేదన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పంపిన పట్టువస్త్రాలను నాయకులు బీర్ల శంకర్, ఈరసరపు యాదగిరి వేదికపైకి వెళ్లి ఇస్తారా? అని ప్రశ్నించారు. విషయ పరిజ్ఞానం లేని కాంగ్రెస్ నాయకులు అనవసరంగా నోరుపారేసుకుంటున్నారని అన్నారు. ప్రొటోకాల్ ఉల్లంఘన జరిగిందని ఈఓను అడిగేందుకు వెళ్తే మర్యాద లేకుండా వ్యవహరించాడని ఆరోపించారు. ఈఓకు ఎమ్మెల్యే అయిలయ్య, ఆయన చెంచాలు వత్తాసు పలుకుతున్నారని తెలిపారు. యాదగిరి కొండపైన రాజకీయ నాయకులు ప్రెస్‌మీట్ పెట్టవద్దని కాంగ్రెస్ పార్టీ నాయకులు అంటున్నారని, మరి గతంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఎలా పెట్టారని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ యాదగిరిగుట్ట క్షేత్రాన్ని మహాద్భుతంగా తీర్చిదిద్దారన్నారు. దేవస్థానంలో కేసీఆర్ సంపదను సృష్టిస్తే కాంగ్రెస్ దొంగలు, రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్వామి వారి ఆదాయాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, బీసీ విభాగం మండలాధ్యక్షుడు కవిడే మహేందర్, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు ముక్కర్ల సతీశ్ యాదవ్, నాయకులు గడ్డం చంద్రం, కాంటేకార్ పవన్, దండెబోయిన వీరేశం, కోన్యాల నర్సింహారెడ్డి, శారాజీ రాజేశ్ యాదవ్ పాల్గొన్నారు.

వృద్ధురాలిపై లైంగికదాడి

బీహార్ యువకుడికి రిమాండ్

భూదాన్ పోచంపల్లి, మార్చి 11 : మండలంలోని జిబ్లక్‌పల్లి గ్రామంలో 85ఏండ్ల వృద్ధురాలిపై బీహార్‌కు చెందిన వలస కూలీ లైంగికదాడికి పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలికి ముగ్గురు కుమారులు. వారంతా గ్రామంలో వేరు వేరుగా ఉంటూ తల్లికి ఓ గది కట్టించి అందులో ఉంచారు. కుమారులు నెలవారీగా భోజనం పెడుతూ బాగోగులు చూసుకుంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై గుర్తు తెలియని వ్యక్తి లైంగికదాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. సోమవారం ఉదయం కోడలు భోజనం తీసుకుని ఇంటికి రాగా, జరిగిన విషయం చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. సంఘటన స్థలంలో దొరికిన రుమాలు ఆధారంగా గ్రామానికి వలస కూలీగా వచ్చిన బీహార్‌కు చెందిన యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించారు. నేరం అంగీకరించడంతో అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ విషయంతో ఆగ్రహించిన గ్రామపెద్దలు గ్రామంలో నివాసముంటున్న ఉపాధి కోసం వలస వచ్చిన 40మంది బీహార్ కూలీలను గ్రామం నుంచి బహిష్కరించారు.

గుట్టలో పసికందు మృతదేహం

యాదగిరిగుట్ట, మార్చి 11 : సమాజానికి భయపడిందో, బిడ్డ భారం అనుకుందో తెలియదు కానీ.. పురిటి మరకలు ఆరకుండానే బొడ్డు సైతం ఊడకుండానే ఆడ పసికందును చెత్త కుప్ప పాల్జేసింది ఆ తల్లి. పట్టణంలోని యాదగిరిపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద ప్రభుత్వాసుపత్రికి కూతవేటు దూరంలో రోడ్డు పక్కనే పడి ఉన్న పసిపాప మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న సీఐ రమేశ్.. పాప మృతదేహాన్ని భువనగిరి జల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్‌ల దొంగకు రిమాండ్

భువనగిరి అర్బన్, మార్చి 11 : పట్టణ పరిధిలో బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా వద్ద పట్టణ పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీ చేస్తుండగా.. అటుగా వచ్చిన పట్టణంలోని రాంనగర్‌కు చెందిన బండారి వెంకటేశ్‌ను ప్రశ్నించారు. అతను పొంతనలేని సమాధానాలు చెప్పడంతో విచారణ చేపట్టారు. ఈ నెల 10న పట్టణంలోని సాయి బార్ ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగలించి హైదరాబాద్‌లో అమ్మినట్లు చెప్పాడు. అతని వద్ద నుంచి 5 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వెంకటేశ్ గతంలో లారీ డ్రైవర్‌గా పనిచేసే క్రమంలో మద్యం, చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. సులువుగా డబ్బులు సంపాదించాలని బైక్‌ల దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపాడు. నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు పట్టణ సీఐ సురేశ్‌కుమార్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరు చోరీ

మోటకొండూర్, మార్చి 11 : మండలంలోని ఇక్కుర్తి గ్రామంలో దొంతిరి శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ బావి వద్ద ఏర్పాటు చేసిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి ధ్వంసం చేసి రాగి వైరును అపహరించుకుపోయారు. ఎలక్ట్రిసిటీ ఇన్‌చార్జి ఏఈ సురేందర్ నాయడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఏర్పాటు చేసిన రెండు 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని దుండగులు పూర్తిగా ధ్వంసం చేసి అందులోని రాగి వైరు, ఆయిల్‌ను దొంగిలించారు. వాటి విలువ సుమారు రూ.లక్షా 20వేలు ఉంటుందని తెలిపారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు.

రోడ్డు, బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలి : సీపీఎం

కనుముక్కుల గ్రామ శివారులో నిరసన తెలుపుతున్న నాయకులు

భూదాన్ పోచంపల్లి, మార్చి 11 : మండలంలోని కనుముక్కుల నుంచి వలిగొండకు వెళ్లే రోడ్డు మార్గంలో ఆషిగానికుంట కోతకు గురవడం, ఇరువైపులా ఉన్న రైతులు తవ్విన రోడ్డును వెంటనే పూడ్చాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం కనుముక్కుల గ్రామంలో సమస్యలను సర్వే చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనుముక్కుల నుంచి చౌటుప్పల్‌కు వెళ్లే మార్గంలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని, రైతు భరోసా ఇవ్వాలని, పేదలకు సంక్షేమ పథకాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్, నాయకులు మంచాల మధు, జంగయ్య, జంగారెడ్డి, జనార్దన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, పాండురంగారెడ్డి, నర్సిరెడ్డి, సాయిరెడ్డి, సూరమ్మ, అమురమ్మ, సుగుణమ్మ, శోభ, జయమ్మ, అలివేలు, యాదమ్మ, అమృత పాల్గొన్నారు.

ఇండ్ల నిర్మాణానికి రూ.15లక్షలు ఇవ్వాలి

అర్హులైన పేదలందరికీ ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.15లక్షలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్, నాయకులు కోడె బాలనర్సింహ, యాదగిరి, కృష్ణ, రాంరెడ్డి, పాల్గొన్నారు.

ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి : సీపీఐ

కుర్రారంలో ఎండిన పంటలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

రాజాపేట, మార్చి 11 : ఎండిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి చిగుళ్ల లింగం డిమాండ్ చేశారు. మండలంలోని కుర్రారం గ్రామంలో ఎండిపోయిన పంట పొలాలను మంగళవారం సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటడం, బోరుబావులు ఎండిపోవడంతో వరి పంట ఎండిపోయిందన్నారు. మండలంలోని గొలుసుకట్టు చెరువులను నింపితే రైతులకు ఎంతో మేలు జరిగేదని పేర్కొన్నారు.

రోజురోజుకూ వందల ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంటుందని, తక్షణమే సాగునీటిని అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఎండిన పంటలకు ఎకరానికి రూ.25వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నంద ఐలయ్య, పెంటపర్తి రవీందర్‌రెడ్డి, జూకంటి రజినీకాంత్, నంద వీరేశం, రాగుల నరేశ్, ఎర్రగుంట సంజీవ, జంగా అంజయ్య పాల్గొన్నారు.

కంకర రోడ్డును బీటీగా మార్చాలి : సీపీఎం

బీటీ రోడ్డు నిర్మించాలని నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఆత్మకూరు(ఎం), మార్చి 11 : మండల కేంద్రంలోని తిమ్మాపురం ఎక్స్ రోడ్ నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మీదుగా విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు కంకరతో ఏర్పాటు చేసిన బైపాస్ రోడ్డును బీటీగా మార్చాలని సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే చేపట్టి వాటి పరిష్కారం కోసం ఈ నెల 28న తాసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు రచ్చ గోవర్ధన్, గ్రామ శాఖ కార్యదర్శి రాచమల్ల సత్తయ్య, రైతు సంఘం మండలాధ్యక్షుడు తుమ్మల సత్యనారాయణరెడ్డి, నాయకులు కందాడి వెంకట్‌రెడ్డి, బుగ్గ రాములు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి : పీఏసీఎస్ చైర్మన్ మల్లేశ్‌గౌడ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ మల్లేశ్‌గౌడ్

ఆలేరు రూరల్, మార్చి 11 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని పీఏసీఎస్ చైర్మన్ మొగులగాని మల్లేశ్‌గౌడ్ అన్నారు. మండలంలోని గుండ్లగూడెంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన మహిళలకు రూ.2500, వృద్ధులకు రూ.4వేల పింఛన్ ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచ్ ఏసిరెడ్డి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గంపల విజయ్‌కుమార్, నాయకులు రచ్చ రాంనర్సయ్య, కందుల రామన్, అయిలి కృష్ణ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి మాదిగ జాతి ద్రోహి

- దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు రాంచంద్రయ్య

దీక్షలో మాట్లాడుతున్న బట్టు రాంచంద్రయ్య

భువనగిరి అర్బన్, మార్చి 11 : రేంవత్‌రెడ్డి ప్రభుత్వం మాదిగ జాతి ద్రోహి అని దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బట్టు రాంచంద్రయ్య అన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టం లేకుండా ఉద్యోగ ఫలితాలు ఇవ్వడాన్ని నిరసిస్తూ పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టం అయ్యేవరకు ఉద్యోగ ఫలితాలను వాయిదా వేయాలన్నారు. మూడు దశాబ్దాల పోరాటంతో సాధించిన ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను రేవంత్ రెడ్డి ప్రభుత్వం దూరం చేసిందని పేర్కొన్నారు. అసెంబ్లీలో మాట ఇచ్చిన రేంవత్‌రెడ్డి నేడు మాదిగ జాతికి ద్రోహం చేస్తూ మాలల కుట్రలకు లొంగి వర్గీకరణ లేకుండా ఫలితాలు ప్రకటిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు దుబ్బ రామకృష్ణ, అశోక్, చంద్రస్వామి, దానయ్య, నల్ల స్వామి, మనోహర్ పాల్గొన్నారు.

మోత్కూరులో చేపల మార్కెట్ ప్రారంభం

మోత్కూరులో చేపల మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, మార్చి 11 : పట్టణంలోని చెరువు కట్ట సమీపంలో మున్సిపల్ నిధులతో నిర్మించిన చేపల మార్కెట్‌ను ఎమ్మెల్యే మందుల సామేల్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకారులకు మార్కెట్ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్‌లో మృతి చెందిన రైతుకూలీ సంఘం నాయకురాలు కందుకూరి అయిలమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎన్.విమల, వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, కళ్యాణ్, సీతయ్య, భీమయ్య పాల్గొన్నారు.

గౌస్‌నగర్ చెరువు నింపాలని ఎమ్మెల్యేకు వినతి

ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న గౌస్‌నగర్ గ్రామ నాయకులు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 11 : బస్వాపురం ప్రాజెక్టు నీటితో గౌస్‌నగర్ చెరువు నింపాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని గౌస్‌నగర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు కోరారు. కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఉప సర్పంచ్ పాక వెంకటేశ్‌యాదవ్ మాట్లాడుతూ బస్వాపురం ప్రాజెక్టు నీళ్లు గ్రామానికి అందించాలని, సాగు, తాగు నీటికి ఇబ్బంది రాకుండా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. చందుపట్ల బ్యాంకు రైతుల రుణమాఫీకి డబ్బులు వచ్చేలా చూడాలన్నారు. గ్రామ సమస్యలపై ఎమ్మెల్యేతో చర్చించి మౌలిక వసతులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చీరిక మల్లారెడ్డి, గోపాలకృష్ణ సంఘం అధ్యక్షుడు పాక జహంగీర్ యాదవ్, నాయకులు పాక మహేశ్‌యాదవ్, శ్రీను పాల్గొన్నారు.

రాచకొండ సీపీని కలిసిన డీసీపీ అక్షాంశ్‌యాదవ్

రాచకొండ సీపీ సుధ